విశాలాంధ్ర నంద్యాల
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10, సెప్టెంబరు 2024

విజయవాడ వరద బాధితులకు సీపీఐ బాసట

విరివిగా విరాళాలు అందించండి..

విశాలాంధ్ర-డోన్ : విజయవాడ వరద బాధి తులకు విరివిరిగా విరా ళాలు అందించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కే.రామాంజనే యులు అన్నారు. సోమ వారం డోన్ పట్టణంలోని సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో బృం దాలుగా ఏర్పడి విరాళాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎప్పుడులేని విధంగా విజయవాడ వరద ముప్పుతో అతులాకులం అయిం దన్నారు. అక్కడి ప్రజలకు కనీస నిత్యావసర వస్తువులు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.ప్రభుత్వం అందించే సాయం కన్నా మనకి తోచిన విధంగా సాయం అందిస్తే అక్కడ ప్రజలకు కాస్త ఉపశమనం ఉంటుందన్నారు. కావున ప్రతి ఒక్కరు బాధ్యతగా విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.రాధాకృష్ణ, పి.సుంకయ్య, సీపీఐ పట్టణ కార్యదర్శి నారాయణ, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు రణత్ యాదవ్, నాయకులు రామ్మోహన్, మహిళా సమాఖ్య నాయకులు సమీమ్ బేగం, లక్ష్మిదేవి, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర-ఆత్మకూరు రూరల్ : విజయవాడలో గత పది రోజులు నుండి ప్రజలు వరదల్లో చిక్కుకొని సర్వస్వం కోల్పోయి, తినడానికి తిండి లేక కనీస వసతులు లేక అల్లాడుతున్న వారికి నంద్యాల జిల్లా ఆత్మకూరు సీపీఐ బాసటగా నిలిచింది. పట్టణంలోని చిరు వ్యాపారుల దగ్గర పది ప్యాకెట్లు బియ్యం, నిత్యావసర సరుకులు, బెడ్ సీట్స్ సేకరించి బాధితులకు పంపనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు తెలిపారు. సోమవారం వరద బాధితుల విరాళాల సేకరణలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్.రంగ నాయుడు, ఆత్మకూరు సీపీఐ కార్యదర్శి ప్రతాప్, ఏఐటీయూసీ నాయకులు బిసన్న, మహిళా సమాఖ్య నాయకురాలు, స్వాతి, మత్తుజాబీ, హమిలి యూనియన్ నాయకులు. చంద్ బాషా,జాకిర్ హుస్సేన్, ఖాదర్ వలి హాజరయ్యారు. రంగనాయుడు మాట్లాడుతూ ఇటీవల కాలంలో ఇంత పెద్ద విపత్తును విజయవాడ ప్రజలు ఎప్పుడూ చూడలేదని ప్రజానీకం అల్లాడిపోతున్నారన్నారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం వెంటనే వరద సహాయక చర్యల కోసం 10వేల కోట్ల ప్యాకేజీలు వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతంగానికీ పంట నష్ట పరిహారం చెల్లిం చాలని కోరారు.

నంద్యాల పట్టణంలో..

విశాలాంధ్ర నంద్యాల అర్బన్: నంద్యాల పట్టణంలో ప్రజలు, ప్రముఖుల వద్ద నుండి బియ్యము, వంటనూనె, నిత్యావసర సరుకులను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్, సిపిఐ పట్టణ కార్యదర్శి కే.ప్రసాద్, ఆళ్లగడ్డ సిపిఐ కార్యదర్శి భాస్కర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాముడు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.సోమన్న, ఏఐటియుసి పట్టణ కార్యదర్శి డి.శ్రీనివాసులతో పాటు నాయకులు విరాళాలు సేకరించారు. విజయవాడ నగరంలో బుడిమేరు కాలువలు తెగడం ద్వారా వచ్చిన వరద వల్ల నష్టపోయిన బాధితులకు సిపిఐ రాష్ట్ర సమితి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ నాయకత్వంలో అనేక ప్రజా సంఘాలు వరద బాధితులకు అండగా నిలిచాయి సిపిఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో గెలివి ఆయిల్ అధినేత రామకృష్ణ 90 ప్యాకెట్లు ఆయిల్ ఇచ్చారని తెలిపారు. ఏపీమహిళా సమాఖ్య మాజీ పట్టణ కార్యదర్శి ఫాతిమా కుమారులు మహమ్మద్, రఫీ, అబ్దుల్ నబీ ఒక టిక్కు సోనా మసూర బియ్యం ఇచ్చారని, మద్దిలేటి ట్రేడర్స్ ద్వారా 25 కేజీల సన్న బియ్యం టిక్కీ సేకరించడం జరిగిందని తెలిపారు.

రెండు నెలల్లో నియోజకవర్గ రూపురేఖలు మారుస్తా

మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి

విశాలాంధ, బనగానపల్లె : రెండు నెలల్లో నియోజవర్గ రూపురేఖలు మారుస్తానని ఆర్అండ్బీ శాఖ మంత్రి బీసీ జనార్దన్రెడ్డి పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం రోడ్డు, పెట్రోల్ బంక్ సర్కిల్, సొసైటీ బ్యాంక్ సమీపంలోని రోడ్డును, డ్రైనేజీని పరిశీలించారు.. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి వైసిపి కార్యకర్తలు పూల దుకాణంతో రోడ్డును ఆక్రమించడాని గమనించి ఉదయం కళ్ళ ఆక్రమణలు తొలగించాలని సీఐ కృష్ణయ్య ఆదేశించారు. అనంతరం పంచాయతీ డీఈ నాగ శ్రీనివాసులు ఆస్థానం రోడ్డు డ్రైనేజ్ ఎస్టిమేషన్ వేయాలని అక్కడికక్కడే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ మహేష్, విద్యుత్ ఏఈ శ్రీనివాసులు, వాణిజ్య విభాగ చైర్మన్ టంగుటూరి సీనయ్య, పట్టణ ఉపసర్పంచ్ బురానుద్దీన్, నియోజవర్గం ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు రాయలసీమ సలాం,పట్టణ అధ్యక్షుడు కాసింబాబు, మల్లారెడ్డి,ఉప సర్పంచ్ మల్లీశ్వర్ రెడ్డి, ఆల్తాఫ్, మురళీమోహన్ రెడ్డి తదితర టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

కడుపునొప్పి తాళలేక మహిళ ఆత్మహత్య

విశాలాంధ్ర, రుద్రవరం : కడుపునొప్పి భరించలేక మహిళ సోమవారం ఆత్మహత్య చేసుకుంది. ఏఎస్ఐ శోభన్బాబు తెలిపిన వివరాలు. మండలంలోని నరసాపురం గ్రామానికి చెందిన విజయలక్ష్మి(29) కొంతకాలంగా కడుపునొప్పితో అవస్థలు పడుతుండేది. పలుమార్లు స్థానిక డాక్టర్ల వద్ద చూపించినా నయం కాలేదు. ఆదివారం రాత్రి భర్త శ్రీనివాసులు, తన కుమారులు ఇంట్లో లేని సమయంలో ఇక కడుపునొప్పి తగ్గదని భావించి జీవితంపై విరక్తి చెంది సౌభాగ్య పౌడర్ను తాగింది. కుటుంబీకులు ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందింది. కేసు నమోదు చేశామని ఏఎస్ఐ శోభన్ బాబు తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన రవాణా ధరలకే ఇసుక సరఫరా

- కలెక్టర్ రాజకుమారి గణియా

విశాలాంధ్ర-నంద్యాల .. ఈనెల 11వ తేదీ నూతన ఉచిత ఇసుక విధానాలు రానున్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఇసుక సరఫరా చేయాల్సి ఉంటుందని కలెక్టర్ జి.రాజకుమారి లారీ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ సభ్యులను కోరారు. సోమవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఉచిత ఇసుక రవాణా ధరల నిర్ధారణపై ట్రాన్సుపోర్టు అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆర్టీఓ శివారెడ్డి, భూగర్భ గనుల శాఖ ఏడి రామచంద్ర హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో ఇసుక రీచులు, స్టాక్ యార్డులు లేవని సమీప జిల్లాల నుండి ఇసుక సరఫరా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో స్టాక్ యార్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 197 టిన్ టైర్స్ వాహనాలను రిజిస్టర్ చేసి ఆన్లైన్లో ఉంచామని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా ఇసుక ఇస్తోందని, రవాణా చార్జీలు మాత్రమే వినియోగదారులు భరించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

ప్రశ్నిస్తే తప్పు పనులు చేయరా : ఉపాధి హామీ పనుల లేబర్ బడ్జెట్, ఇళ్ల నిర్మాణాల పురోగతి, పంట నష్ట నమోదు, ఈ క్రాప్ బుకింగ్, ఓడిఎఫ్ ప్లస్ సర్వే తదితర అంశాలలో నిర్దేశించిన ప్రగతి లక్ష్య సాధనలో కొంతమంది మండల క్షేత్రస్థాయి అధికారులు తక్కువ ప్రగతి సాధిస్తున్నారని ప్రశ్నిస్తే తప్పు పనులు చేయరా అని కలెక్టర్ జి.రాజకుమారి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా క్షేత్రస్థాయిలో 100 రోజుల పనుల ప్రగతిపై లక్ష్యాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రగతి లక్ష్యసాధనలో అప్పగించిన పనులు పూర్తి చేయడంలో అలక్ష్యం చేస్తున్నారని. ఏ ఒక్క అధికారికి నేను ముందుండాలి అనేది ఉందా..? అని ప్రశ్నిస్తూ మనసు పెట్టి పని చేయాలని అధికారులను ఆదేశించారు. 100 రోజుల ప్రణాళికలో భాగంగా ఉపాధి హామీ పనులకు కేటాయించిన లేబర్ బడ్జెట్ ఆత్మకూరు క్లస్టర్ పరిధిలోని అన్ని మండలాలలో తక్కువగా ఉందని, పనితీరు మెరుగుపరచుకొని నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని ఆదేశించారు.

పంచాయతీల అభివృద్ధి పవన్ కళ్యాణ్ ధ్యేయం..

ఎమ్మెల్యే గిత్త.జయసూర్య

విశాలాంధ్ర-పాములపాడు :- పంచాయతీల అభివృద్ధి పవన్ కళ్యాణ్ ధ్యేయమని నంది కొట్కూ రు ఎమ్మెల్యే గిత్త జయ సూర్య తెలిపారు. పాములపాడు లోని ఎంపీడీవో కార్యాలయంలో సోమ వారం జనసేన సీనియర్ నాయకుడు రాము అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నందికొట్కూరు శాసనసభ్యులు గిత్త జై సూర్య, ఎంపీపీ సరోజినీ వర్ధిన్య, తాసిల్దార్ సుభద్రమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ, జిల్లా జనసేన నాయకులు చింత సురేష్ రామిరెడ్డి, సమన్వయకర్త రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తన సొంత నిధులతో, రాష్ట్రంలోని 400 వరద పీడిత పంచాయతీలకు లక్ష రూపాయల చొప్పున విరాళంగా ప్రకటించారనీ అందులో మండలంలో వేంపెంట భానుముక్కల పంచాయతీల్లో ఎంపిక చేశారని గ్రామ పంచాయతీల అభివృద్ధే రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధేయమని కొనియాడారు. అనంతరం వేంపెంట సర్పంచి మాణిక్యమ్మ, భానుముక్కల సర్పంచ్ బండ్లమూరి వెంకటేశ్వరరావుకు చరో లక్ష చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ నాయకులు మధు, సంపత్ కుమార్, రాము,శేషు, పుష్ప, నాగరాజు, రమేష్, సూర్యబాబు, గాబ్రియల్,చరణ్, సురేష్, ఎస్సై- కే.సురేష్ బాబు, బీజేపీ నాయకులు చల్లా దామోదర్ రెడ్డి, టీడీపీ నాయకులు మాంద్ర. సురేంద్రనాథ్ రెడ్డి,సి.గోవిందు, ముద్రగడ శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి

.. బీసీ ఇందిర రెడ్డి..

విశాలాంధ్ర, బనగానపల్లె : బనగానపల్లె పట్టణంలో వెలిసిన పలు వినాయక మండపాల్లోని గణనాథులను దర్శించుకుని రాష్ట్ర మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిర రెడ్డి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ మాట్లాడుతూ గణనాథుల ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నియోజకవర్గంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గౌరవాధ్యక్షులు టంగుటూరి సీనయ్య, వంగల పరమేశ్వర్ రెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కృష్ణనాయక్,రఘురాంరెడ్డి, టీచర్ నాగరాజు, కోడి నాగేష్, తలారి హరి, తదితరులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె...

విశాలాంధ్ర-వెల్దుర్తి: ఇటీవల ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని అల్లుగుండు గ్రామంలో అనీఫ్ కుటుంబ సభ్యులు మట్టి మిద్దెలో నివాసముంటున్న, ఇటీవలే కురిసిన వర్షాలకి మట్టిమిద్దె కూలిపోయింది, ఇంట్లో ఉన్న వ్యక్తులకు పెద్ద ప్రమాదమే తప్పినట్లు బాధితులు తెలిపారు. ఆస్తి నష్టం ఫ్రిడ్జ్, టీవీ, ఆహార పదార్థాలు లక్ష రూపాయలు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

సీనియర్ టీడీపీ నాయకుడు ఆకస్మికంగా మృతి

విశాలాంధ్ర. నందికొట్కూరు : పగిడ్యాల మండలం ప్రాతకోట గ్రామానికి చెందిన మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్, సీనియర్ టిడిపి నాయకుడు పలుచాని జనార్దన్రెడ్డి అకాల మృతి చెందారు. నందికొట్కూరు నియోజవర్గంలో గౌరు వెంకట్రెడ్డికి కుడి భుజంగా పనిచేశారు. అప్పట్లో ఆయన రైతులకు పగిడాల మండలంలో ఎన్నో సౌకర్యాలు కల్పించారు. విషయం తెలుసుకున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత రెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ ఇంచార్జి గౌరు వెంకట్ రెడ్డి, నంది కొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య గ్రామానికి చేరుకుని జనార్దన్ రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో ఖాతా రమేష్రెడ్డి, వెంకటేశ్వర్ల యాదవ్, సంపత్ కుమార్ యాదవ్,వీరం ప్రసాద్ రెడ్డి, టిడిపి నాయకులు రమణ, ముత్తు జావలి, పగడం శేఖర్, రవి చౌదరి, నియోజవర్గ టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ ..

విశాలాంధ్ర-వెల్దుర్తి: పట్టణంలో బి.సి. బాలికల వసతి గృహాన్ని కర్నూలు జిల్లా అసిస్టెంట్ బీ.సి.వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని విద్యార్థినీలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహ అధికారిణి శైలజ వసతి గృహాన్ని తీర్చిదిద్దడంలో ఆదర్శంగా వున్నారన్నారు, పదవ తరగతి విద్యార్థినీలు 2023- 2024 సంవత్సరానికి గాను వంద శాతం ఉత్తీర్ణత సాధించారని, ఇందుకు కృషి చేసిన వసతి గృహ అధికారిణి శైలజను శ్రీనివాసులు అభినందించారు.

సీపీఐ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ

విశాలాంధ్ర, నందికొట్కూరు : స్థానిక సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో దుకాణాల దగ్గర విరాళాలు సేకరించారు. రూ.6 వేలతో పాటు దుప్పట్లు ప్లేట్లు ప్రజలు విరాళంగా ఇచ్చారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వి రఘురాం మూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి శ్రీమతి రజితమ్మ పట్టణ మహిళా నాయకులు భాను ,షరీఫా బేగం, ఏఐఎస్ఎఫ్ తాలుక అధ్యక్షులు వినోద్ కుమార్ పాల్గొన్నారు.

16 బస్తాల బియ్యం సేకరణ

విశాలాంధ్ర రుద్రవరం .. సిపిఐ మండలం సమితి ఆధ్వర్యంలో 16 బస్తాల బియ్యాన్ని విజయవాడ వరద బాధితుల కోసం సేకరించినట్లు సోమవారం సిపిఐ మండల కార్యదర్శి బాల నరసింహులు, రైతు సంఘం నాయకులు వెంకటేశ్వర్లు తెలిపారు. కొన్ని రోజుల క్రితం విజయవాడలో వరదలతో తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకోవడానికి తమ వంతు సహాయంగా 16 బస్తాల బియ్యాన్ని సేకరించి భారత కమ్యూనిస్టు పార్టీ నంద్యాల జిల్లా ఆఫీసుకు పంపడం జరిగిందని నాయకులు తెలిపారు. బియ్యం సేకరణలో సీపీఐ నాయకులు రైతు సంఘం నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

గణనాధులకు నీటి కష్టాలు

విశాలాంధ్ర కొలిమి గుండ్ల : మండలంలో తీవ్ర వర్షాభావం ఏర్ప డడంతో గణనాథుని నిమజ్జనానికి నీటికష్టాలు తప్పలేదు. మండలంలోని 33 గ్రామాల పరిధిలో వర్షాలు పడకపోవడంతో అయా గ్రామాల పరిధి లోని నీటి వనరులన్నీ ఎండిపోయాయి. గణేష్ నిమజ్జనానికి అవుకు, సంజమల మండలాలలోని చెరువులలో నిమజ్జనం చేయడానికి గణేష్ విగ్రహా లను తరలించారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా సద్దల గంగన్న చెరువు, తిమ్మనాయుని పేట చెరువు, దయ్యాల చెరువు, శిలార్ చెరువు, పెద్ద వెంతుర్ల ఎర్ర నల్ల చెరువులు, హనుమంత గుండం చెరువులు వెలవెలబోతున్నాయి. కొలిమిగుండ్ల,పెట్నికోట, కోటపాడు, తిమ్మనాయుని పేట, చింతలాయపల్లి చుట్టుపక్కల గ్రామాలలో విగ్రహాలను జిఎన్ఎస్ఎస్ కాలువలో నిమజ్జనం చేశారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన

విశాలాంధ్ర, జూపాడు బంగ్లా : ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయ ప్రతి ఒక్కరూ వాడాలని వెలుగు ఏపిఎం అంబమ్మ, మండల సీఆర్పి బాల స్వామి అన్నారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన కూరగాయలనుఏర్పాటు చేసి రైతులకు వివరించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పంటల సాగులో ఎక్కువగా విషపూరిత మందులు వాడుతూ ఉండడం వలన ప్రజలు అనేక రకాల వ్యాధులతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. అందువల్ల పశువుల పేడ, వాటి మూత్రం తదితరాలతో పంటలు పండించాలని అన్నారు. ఆయా గ్రామాల సిఆర్పిలు, మహిళలు ప్రకృతి వ్యవ సాయం గురించి వివరించారు. మానవాళి మనుగడ కోసం ప్రకృతి వ్యవసాయం చేయాలని ఆహార భద్రత ఆరోగ్య భద్రత కాపాడుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ చంద్రశేఖర్,ఎస్సై లక్ష్మీనారాయణ, ఇంచార్జి ఎంపీడీవో నూర్జహాన్, ఏపీవో గౌరీ బాయ్, సీఆర్పీలు రాధిక, వెంకటేశ్వరమ్మ, జయమ్మ, పార్వతి పాల్గొన్నారు.

గంగమ్మ ఒడికి తరలిన గణపయ్యలు

విశాలాంధ్ర ఆత్మకూరు రూరల్ : నంద్యాల జిల్లా వ్యాప్తంగా మూడు రోజులుగా జరుగుతున్న వినాయక చవితి ఉత్సవాలు సోమవారం నిమజ్జన కార్యక్రమంతో ముగిశాయి. మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం సంప్రదాయ బద్ధంగా వినాయక మండపాలలో గణనాథులు కొలువుతీరారు. సోమ వారం గణపతిని మేళతాళాలతో ఊరేగింపుగా తరలించారు. ఆత్మకూరు అమ్మవారి శాలలో కొలువై ఉన్న వినాయకుడి విగ్రహం నిమజ్జన కార్యక్రమంను శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆత్మకూరులో కొలువై ఉన్న వినాయకుడి విగ్రహాలన్నీ వరుసగా నిమజ్జన కార్యక్రమానికి బయలుదేరాయి.

అవుకు : మండలంలో

విశాలాంధ్ర-కొలిమిగుండ్ల : మండల వ్యాప్తంగా సోమవారం గణేష్ నిమజ్జన వేడుకలు వైభవంగా నిర్వహించారు. వినాయక చవితి పండుగను పురస్కరించుకొని గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శనివారం ఆయా గ్రామాలలో అందంగా అలంకరించిన మండపాలలో గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేశారు. మూడు రోజులపాటు ఆయా గ్రామాలలో మండపాలలోని గణేష్ విగ్రహా లకు భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేసి నిమజ్జనానికి తరలించారు.

విశాలాంధ్ర, బనగానపల్లె: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనం వైభవంగా సాగింది. నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లోని పలు వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గణపతి బొప్ప మోరియా నినాదాలు మార్మోగాయి. యువకుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. మూడు రోజులు పాటు పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో కొలువైన గణనాయక ప్రతిమలకు సోమవారం పెద్ద ఎత్తున పూజలు, అన్నదానం నిర్వహించి ఆయా గ్రామ శివారులో ఉన్న చెరువుల్లో నిమజ్జనం చేశారు.

రుద్రవరంలో నిమజ్జనానికి వినాయకున్ని తరలిస్తున్న గ్రామస్తులు

మిడుతూరులో వేలంలో గణేష్ లడ్డూను దక్కించుకున్న నాయకుడు

జూపాడుబంగ్లా మండలంలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

వెలుగోడు

నంద్యాలలోని ఎల్వేర్ గ్లోబల్ స్కూల్లో..

ఉయ్యాలవాడలో నిమజ్జనానికి తరలి వెళ్తున్న గణనాథులు

విశాలాంధ్ర కర్నూలు
www.visalaandhra.com
కర్నూలు, మంగళవారం 10,సెప్టెంబర్ 2024

దొంగతనాల కేసు ఛేదించిన పోలీసులు

ముగ్గురు దొంగలు అరెస్టు
9 మంది నిందితులపై కేసులు నమోదు
వాహనాలు స్వాధీనం..రూ.9 లక్షలు నగదు సీజ్

విశాలాంధ్ర-నందవరం / ఎమ్మిగనూరు : తుంగభద్ర నది తీరం వెంట గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకంలో జరిగిన దొంగతనాల కేసునుఎట్టకేలకు నందవరం పోలీసులు ఛేదించారు.కేసుపై ఎమ్మిగనూరు ఇన్చార్జ్ డీఎస్పీ శ్రీనివాసచారి మాట్లాడుతూ కొన్ని నెలలుగా రైతులకు నీళ్ళుఅందించే ఎత్తిపోతుల పథకాల దగ్గరున్న ట్రాన్స్‌ఫారం పగలకొట్టి, అందులోని కాపర్‌వైర్లు, రాగి ప్లేట్లు, అయిల్‌ను దొంగతనం చేసే వారని, దింతో రైతుల పొలాలకు సాగునీళ్లు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడడం జారిగిందని, దింతో లిఫ్ట్ ఇరిగేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో నందవరం-3, మంత్రాలయం-3, కోసిగి, డోన్, కడపలో చెరొక కేసుతో మొత్తం 9 కేసులు నమోదయ్యా యన్నారు. జిల్లా ఎస్పీ ప్రత్యేక చొరవతో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి, వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు దొంగతనం జరిగిన ప్రదేశాలు పరిశీలించి సాంకేతిక పరిజ్ఞానంతో నిందుతులు మహారాష్ట్రకుచెందిన అంతరాష్ట్ర దొంగలుగా గుర్తించామన్నారు. మరో సారి దొంగతనం చేయడానికి వస్తున్నారని సమాచారంతో అందడంతో వారి కాల్‌డేటా ఆధారంగా నిందితులను ఎంతో చాకచక్యంగా నందవరం మండలం నాగలదిన్నె వంతెన దగ్గర పోలీసులు పట్టుకున్నారన్నారు. మహారాష్ట్రకు చెందిన నిందితులు కరణ్ సర్వదే, కరీముద్దీన్, షేక్ జాహిర్ల దగ్గర నుండి దొంగతనానికి ఉపయోగించిన మినీ లారీతో పాటు వాహనం,గతంలో నిందితులు రాగివైర్లు అమ్మిన రూ. 9లక్షల స్వాధీనం చేసుకొని, ముగ్గురు నిందితులను అరెస్టు చేయగా, మరోనలుగురు ముద్దాయిలు పరారీలో ఉన్నారన్నారు. ఎమ్మిగనూరు రూరల్, కోసిగి సీఐలు విక్రమ సింహ, మంజునాథ్, నందవరం ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూతనిద్దాం-సీపీఐ

విశాలాంధ్ర-పత్తికొండ: ప్రకృతి వైపరీత్యాల కారణంగా ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సర్వసం కోల్పోయిన విజయవాడ బాధితులకు తమ వంతు చేయూత నివ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పిలుపు నిచ్చారు. సోమవారం స్థానిక చదువుల రామయ్య భవనంలో వరద బాధితులకు సహాయార్థంగా పట్టణ టైలర్స్ అసోసియేషన్ నాయకులు, ప్రభాస్ అభిమానులు నిత్యావసర వస్తువులు, బియ్యం, మంచి నూనె పాకెట్లు, నూతన వస్త్రాలను సిపిఐ నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా బి. గిడ్డయ్య మాట్లాడుతూ ఎడతెరపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా మునుపెన్నడులేని విధంగా విజయవాడ నగర ప్రజలు తీవ్రంగా నష్టపోవడం జరిగిందని, వరద బాధితులకు తమ వంతు బాధ్యతగా సహాయ సహకారాలు అందించి అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. వరద బాధితులకు సహాయం అందించిన వస్తువులను తమ పార్టీ ద్వారా బాధితులకు నేరుగా పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు పి.భీమలింగప్ప, మండల కార్యదర్శి డి.రాజాసాహెబ్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కారుమంచి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, తిమ్మయ్య, పెద్దఈరన్న, మండల సహాయ కార్యదర్శి రంగన్న, టైలర్స్ అసో సియేషన్ నాయకులు, ప్రభాస్ ఫ్యాన్స్ పాల్గొన్నారు.

వరద బాధితుల కోసం విరాళాలు సేకరణ

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: విజయవాడలో వరద బాధితుల కోసం సీపీఐ నగర సమితి సోమవారం నగరంలో విరాళాలు సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఆవుల శేఖర్ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కె.జగన్నాథం,సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ మునెప్ప ,నగర కార్యదర్శి పి రామకృష్ణారెడ్డి,సహాయ కార్యదర్శులు డి శ్రీనివాసరావు, సి మహేష్, నగర కార్యవర్గ సభ్యులు నాగరాజు, అన్వర్, బీసన్న, ఈశ్వర్ కుమార్, నల్లన్న, సోమన్న, నగర నాయకులు రామాంజనేయులు, సురేంద్ర యాదవ్, కుమార్ రాజా, రామాంజిగౌడ్, బాబయ్య కుమార్, ప్రజానాట్య మండలి నాయకులు మాణిక్యం, శ్రీనివాసులు, బద్రి వెంకటేశ్వర్లు, సీపీఐ కార్యకర్తలు విరాళాల సేకరణ కార్యక్రమం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరంలో షాప్ తిరిగి ప్రతి షాపు తిరిగి విజయవాడ వరద బాధితుల కోసం విరాళాలు సేకరించారు. కర్నూలుకు వరదలు వచ్చినప్పుడు వివిధ జిల్లాల నుండి పెద్ద మనసుతో మన నగర ప్రజలకు సహాయ సహ కారాలు అందించడం జరిగిందన్నారు.. ఇప్పుడు విజయవాడ నగరానికి వరదలు రావడంతో నగర ప్రజలు కూడా సహకరించడంలో ముందుకు రావాలని సీపీఐ నాయకులు విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-తుగ్గలి: మండల పరిధిలోని జొన్నగిరికి చెందిన జి.హనుమన్న (59) సోమవారం రైలు కింద పడి తనువు చాలించాడు. వివరాలలోకి వెళితే.. హనుమన్న తన భార్య జమునమ్మ పేరు మీద 4.50 ఎకరాల పొలంతో పాటు మరో 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని తన జీవనం కొనసాగిస్తున్నారు.కొన్నేళ్లుగా పంటలు ఆశాజనకంగా లేక పోవడం, సరైన దిగుబడి లేక పెట్టుబడులు కూడా తిరిగి రాకపోవడంతో పూర్తిగాఅప్పుల పాలయ్యాడు. పంట పొలాల సాగు కొరకు సుమారు రూ.15 లక్షల వరకు అప్పు చేసినట్లు కుటుంబీకులు తెలిపారు.ఈ సంవత్సరం కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతినడంతో చేసిన అప్పులు తీర్చలేనని మనస్థాపం చెంది రైలు కిందపడి మృతి చెందినట్లు తెలిపారు. హనుమన్నకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలున్నట్లు తెలిపారు. సంఘటన స్థలానికి రైల్వే పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకొని, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వాసు పత్రికి తరలించారు. మృతిచెందిన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ ప్రజలు మరియు గ్రామ రైతులు తెలిపారు.

విద్యా కాషాయికరణకు వ్యతిరేకంగా ఉద్యమిద్దాం..ఏఐఎస్ఎఫ్

విశాలాంధ్ర-దేవనకొండ : విద్యాకాషాయకరణ, కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లాఉపాధ్యక్షులు శరత్ కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ సభ్యత్వ నమోదు చేపట్టారు.ఈసందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ నిరంతరం విద్యారంగ సమస్యలపై పోరాడుతుందన్నారు. పేద, బడుగు,బలహీన వర్గాల విద్యార్థులకు అండగా ఉండి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల విద్యావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా విద్యార్థులను సంఘటితం చేస్తూ అనేక పోరాటాలు చేపట్టి ఎన్నో విజయాలను ఏఐఎస్ఎఫ్ సొంతం చేసుకుందని గుర్తు చేశారు. జిల్లాలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులు దుర్భర మైన పరిస్థితుల్లో ఉన్నారని, వారి యొక్క సమస్యలను స్పందించి, పరిష్కరించలేని పరిస్థితుల్లో ఉన్నతాధికారులున్నారని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు ఏఐఎస్ఎఫ్ నిరంతరం ఉద్యమిస్తుందని,ఈఉద్యమంలో విద్యార్థులానంతా భాగస్వాములను చేసేందుకే ఏఐఎస్ఎఫ్ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని చేపడుతున్నామని, ప్రతివిద్యార్థి ఏఐఎస్ఎఫ్ సభ్య త్వం తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష,కార్యదర్శులు మధు,భాస్కర్ నాయకులు ఉమేష్, సురేంద్ర, రవి, మహేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకి సర్కిల్ రోడ్డుకు తాత్కాలిక మరమ్మత్తు

విశాలాంధ్ర-హొళగుంద: బస్టాండ్ నుండి స్థానిక వాల్మీకి సర్కిల్ వరకు రోడ్డు అధ్వానంగా ఉన్న కథనాన్ని సోమవారం విశాలాంధ్రలో'**రోడ్డుఇలా.నడిచేదెలా'** అధ్వాన్నంగా ఉన్న వాల్మీకి సర్కిల్‌రోడ్డు అనే కథనానికి సర్పంచు రంగమ్మ స్పందించారు.రోడ్డు మరమ్మతు పనులను వైసీపీ నాయకుడు పంప, గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్‌వార్డు మెంబర్ సుభాన్ రోడ్డు మరమ్మతు పనులను ప్రారంభించారు. రోడ్డు మరమ్మతుకు ట్రాక్టర్ల ద్వారా గరుసుమట్టిని వేసి గుంతలు పూడ్చి వేశారు.జేసీబీ సాయంతో రోడ్డును చదును చేశారు.ఈ సందర్భంగా గ్రామ కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ మాట్లాడుతూ వాల్మీకి సర్కిల్ రోడ్డు అధ్వానంగా ఉన్న కథనం విశాలాంధ్ర పత్రికల్లో ప్రచురించినందుకు చేపట్టామని ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.రోడ్డు తమ పరిధిలోకి రాదని ఆర్‌అండ్‌బి శాఖ పరిధిలోకి వస్తుందని అయినా కూడా ప్రజలు పడే నానా అవస్థలు తీర్చడానికి ఊరు మర్యాద కోసం పంచాయతీ నిధులతో తాత్కాలిక రోడ్డుమరమ్మతు చేశామన్నారు రోడ్డు మరమ్మతూ చేయడం పట్ల ప్రజల రాకపోకలకు ఎంతో అనుకూల మయింది.

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

విశాలాంధ్ర-సి.బెళగల్: గ్రామ రైతు సేవ కేంద్రాల ఇన్చార్జీలకు పంట కోత ప్రయోగాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం మండల వ్యవసాయ అధికారి జి.మల్లేష్‌కుమార్ అధ్యక్షతన మండల అధికారి ఆదినారాయణ ఆధ్వర్యంలో పంట కోత ప్రయోగాలపై అవగాహన కల్పించారు. 2024 సం సీజన్ కిసంబంధించిన జనరల్ సాధారణ పంటకు పంట కోత ప్రయోగం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన కింద ప్రయోగాలు గణాంక కార్యాలయం నుంచి రావడం జరిగిందని తెలిపారు. ఆర్ఎస్కే ఇన్చార్జిలకు అవగాహన కల్పించి వాటి గురించి క్లుప్తంగా వివరించారు. రైతులు, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీ కొని మహిళ మృతి

విశాలాంధ్ర-గోనెగండ్ల: ట్రాక్టర్ ఢీకొని జయశ్రీ (29) అనే మహిళమృతి చెందినట్లు సీఐ గంగాధర్ తెలిపారు. పోలీసులు అందించిన సమాచారం మేరకు ఐరన్ బండ గ్రామానికి చెందిన బోయ రవి, అతని భార్య జయశ్రీ (29) వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కూలీ పని చేసుకొని జీవనం సాగించేవారు.గొల్ల పద్మావతి, వలిభాష వేరుశనగపంట పొలానికి కూలీకి జయశ్రీ వెళ్లింది.అయితే మార్గమధ్యలో అంజినేయస్వామి, మన్యం రస్తా, ముల్లా చిన్నవలి పొలం దగ్గర వెనుక వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా, నిర్లక్ష్యంతో డ్రైవింగ్ చేస్తూ జయశ్రీని ఢీ కొట్టడంతో కిందపడి తలకు గాయమై రోడ్డుపై పడింది. వెంటనే జయశ్రీని భర్త గమనించి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో జయశ్రీ మృతిచెందింది. ట్రాక్టర్ ఢీ కొట్టిన ముల్లా మహబూబ్‌బాషపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని జయశ్రీ భర్త బోయ రవి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంగాధర్ తెలిపారు.

సీఎం సహాయ నిధికి చెక్కు

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : వరద బాధితులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధికి కర్నూలు నగరంలోని ఆంధ్ర బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వారి తరపున విరాళంగా రూ.1,01,116 చెక్కును ఆంధ్రబ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.ప్రభాకర్, సెక్రెటరీ కె.రాఘవేంద్ర ప్రసాద్‌లు అందజేశారని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిఎం సహాయనిధికి చెక్కును అందజేసిన వారిని అభినందించారు.

గడువులోగా అర్జీలు పరిష్కరించాలి-నగరపాలక కమిషనర్

విశాలాంధ్ర-కర్నూలు సిటీ: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చే అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ పి.వి. రామ లింగేశ్వర్ అధికారులను ఆదేశించారు.సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 18 అర్జీలు వచ్చాయి. వాటిలో ప్రధానంగా రోడ్లు, శానిటేషన్, వీధిదీపాలు తదితర సమస్యలపై స్థానికులు అధికారులకు అర్జీలు అందజేశారు. ప్రజల నుండి ఒక్కొక్క అర్జీ స్వీకరిస్తూ, వారి సమస్యను విన్న కమిషనర్ వాటిని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆరోగ్యధికారి డా.కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ.వేణుగోపాల్, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, మేనేజర్ ఎన్.చిన్నరాముదు, ఆర్ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, డిపిఓ ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

విశాలాంధ్ర-తుగ్గలి : మండల పరిధిలోని చెన్నంపల్లి-పగిడిరాయి సరిహద్దులో ఆదివారం ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సెబ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాహనంలో తరలిస్తున్న 260 రేషన్ బియ్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, వాహనాన్ని అనుసరిస్తున్న కారును సైతం స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ అధికారులు తెలిపారు. అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న డోన్ మండలం, కొత్తచెరువుకు చెందిన వడ్డే సురేష్, గుత్తి మండలం కరిడికొండకు చెందిన దాసరి శంకర్,గుత్తి మండలం మారుతీ నగర్‌కు చెందిన బైమాలీ శివప్రసాద్ ను అదుపులోకి తీసుకొని జొన్నగిరి పోలీసులకు అప్పచెప్పినట్లు సెబ్ అధికారులు తెలియజేశారు. జొన్నగిరి పోలీస్ స్టేషన్ నందు ముగ్గురు ముద్దాయిలపై కేసునమోదు చేసి,రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అందజేసినట్లు జొన్నగిరి పోలీసులు తెలిపారు.రెవిన్యూ అధికారులు స్వాధీన పరుచుకున్న రేషన్ బియ్యాన్ని గోడౌన్ కు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండాలి

విశాలాంధ్ర-బళ్ళారిచౌరస్తా: విద్యార్థులు మానసికంగా దృడంగా ఉన్నప్పుడే విజయాలు సొంతమవుతాయని సైకాలజిస్ట్ అండ్ హిప్నో తెరపిస్ట్ సిరిగిరెడ్డి జయారెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఏపి క్యాంపు సిఆర్ఆర్ఎం మున్సిపల్ హై స్కూల్లో సోమవారం లయన్స్ క్లబ్ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్,విద్యా హిప్నాటిజం సెంటర్ల ఆధ్వర్యంలో యువత ఆత్మస్థైర్యంతో విజయాన్ని సాధించడం అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోలయన్స్ క్లబ్ ఆఫ్ కర్నూలు మెల్విన్ జోన్స్ అధ్యక్షులు లయన్ పి.సి.పవన్‌కుమార్, సిఆర్ఆర్ఎంపాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరెడ్డి, పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకు రావాలి



విశాలాంధ్ర-కర్నూలు సిటీ: వరద బాధితులను ఆదుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి పిలుపు నిచ్చారు. స్థానిక ఎస్టీబీసి కళాశాల కాంపౌండ్ నివాసి వి.సైమన్ విజయవాడ వరద భాదితుల కొరకు ముఖ్యమంత్రి సహాయ నిధికి అందచనున్న రూ.20 వేల చెక్కును ఎస్వీ మోహన్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఎస్వీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ సాటిమనసులు ఇబ్బందిలో ఉన్నప్పుడు ఆదుకోవాలనే గొప్ప మనసుతో ముందుకు వచ్చిన సైమన్‌ను అభినందించారు. ప్రతిఒక్కరిలో ఇలాంటి ఆలోచన రావాలన్నారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి

విశాలాంధ్ర-వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి 12వ వార్డులో నివాసముంటున్న ఆటో డ్రైవర్ పాణ్యం శివారెడ్డి (42) ఉదయం గుండెపోటుతో మరణించాడు.మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుని కుటుంబ సభ్యులను ఏఐటీయూసీ పరామర్శించారు.

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ చేయడం ఉపసంహరించుకోవాలి

విశాలాంధ్ర-పత్తికొండ: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీవరం చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ కార్యదర్శి ఎన్. కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు పెద్ద ఈరన్న, ఉమాపతి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక చదువుల రామయ్య భవనంలో ఏర్పాటు చేసిన కార్మిక, రైతు సంఘాల సమావేశంలో వారు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేసే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలన్నారు. విశాఖఉక్కు-ఆంధ్రుల హక్కు అని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారని గుర్తు చేశారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేట్ పరం చేసే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ మంగళవారం(నేడు) తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు కారన్న, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నెట్టికంటయ్య, రంగన్న, తదితరులు పాల్గొన్నారు.

పాలక ప్రభుత్వాల వైఖరికి నిరసనగా ఆందోళనలు

విశాలాంధ్ర-ఎమ్మిగనూరు: విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలంబిస్తున్న మోసపూరితమైన వైఖరికి నిరసనగా ఈనెల 10వ తేదీన రాష్ట్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు ఆందోళన జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు తిమ్మా గురుడు, రాముదు,ప్రసాద్, తెలిపారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ,సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ కార్మిక సంఘాల నాయకులు తిమ్మ గురుడు,రాముదు,ప్రసాద్, మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న నడుస్తున్న ఏకైక ప్రభుత్వ సంస్థ విశాఖ పట్నం స్టీల్ ప్లాంట్ మాత్రమేనన్నారు. ఆ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయడానికి పాలక ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని, ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటులో 32 మంది ప్రాణ త్యాగాల ద్వారా సాధించుకోవడం జరిగిందని వారు గుర్తు చేశారు. ఈప్లాంట్ కోసం వేలాది ఎకరాలు రైతులు త్యాగం చేయడం జరిగిందని ఈ సందర్భంగా వారు తెలిపారు.స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరుణకు వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా పెద్దఎత్తున కార్మిక సంఘాలు రైతుసంఘాల ఆధ్వర్యంలో జరగనున్న ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయడంతో పాటు ప్రభుత్వాల రాజకీయ నాయకులకు గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, కార్మిక సంఘాల నాయకులు వీరేష్, ఏసోబు,రాజు, రామంజి, సమీ ఉల్లా, నరసింహులు,సుంకన్న, మల్లికార్జున గౌడ్,నాగరాజు, పెద్ద సుంకన్న, చిన్న నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ కర్నూలు కొరకు పోరాడుదాం-పరిరక్షణ కమిటి

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: హంద్రీ నది, కె.సి. కెనాల్‌లను కాలుష్యం నుండి, ఆక్రమణల నుండి కాపాడాలని, కర్నూలును స్వచ్ఛ నగరంగా తీర్చి దిద్దాలని 'హంద్రీ, కె.సి.కెనాల్ పరిరక్షణ కమిటీ' డిమాండ్ చేసింది. సోమవారం పరిరక్షణ సమితి జిల్లా పరిషత్ కార్యాలయం నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు, నగరంలోని మద్దతుగా పాల్గొన్నారు.ముందుగా కమిటీ కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ కొన్నేళ్లుగా కె.సి. కెనాల్, హంద్రీ నదులు కాలుష్యానికి గురవుతున్నాయనీ, కె.సి.కాలువలో మురుగు నీరు ప్రత్యక్షంగా కలుస్తోందన్నారు. హంద్రీలో చెత్తా చెదారం పెరిగిపోవడం,ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో నదిలో పూడిక మరింత పెరిగిందన్నారు. తక్షణమే పూడిక, చెత్తా చెదారాన్ని తొలగించి రక్షణగోడ ఏర్పాటు చేయాలన్నారు.సాహితీవేత్త చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ 20 ఏళ్ల కిందట హంద్రీ, కెసి కాలువలో స్వచ్ఛమైన నీరు పారేదని, ప్రస్తుతం కాలుష్యం పెరిగిపోయి, కర్నూలులో దోమలు పెరిగి పోయాయని, స్వచ్ఛ కర్నూలును సాధించేంత వరకు ఉద్యమం జరుగాలని, అధికారులపై, ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం నాయకులు రామకృష్ణ మాట్లాడుతూ హంద్రీ కర్నూలులో ఆక్రమణలకు గురవుతోందని, అనధికార ఆక్రమణలకు అరికట్టాలని, ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని చెప్పారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మునెప్ప మాట్లాడుతూ కె.సి. కెనాల్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, పెద్ద మొత్తంలో నిధులు కేటాయించి, యుద్ధ ప్రాతిపదికన హంద్రీ నదిని శుభ్రం చేయాలని, వరదల నివారణకు రక్షణ గోడలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజాభ్యుదయ సంస్థ నాయకులు భార్గవ, జనవిజ్ఞాన వేదిక నాయకులు శేషాద్రి రెడ్డిలు మాట్లాడుతూ, కలుషిత నీరు తాగడంతో వివిధ రకాల రోగాలు వస్తున్నాయని, కెసి కాలువలో మురుగునీరు కాలువ కుండా అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన ప్రదర్శనలో ఇంకా వివిధ ప్రజాసంఘాల నాయకులు చాంద్ బాషా, ప్రజా పరిరక్షణ వేదిక డేవిడ్, రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, కార్మిక సమాఖ్య నాయకులు నాగన్న, ప్రజా అభ్యుదయ సంస్థ నాయకులు శ్రీనివాస రావు, విరసం బాధ్యులు పాణి, పౌరహక్కుల సంఘం నాయకులు,అల్లా బకష్, కరీంబాషా, ప్రజా పరిరక్షణ రవికుమార్, యోహాను, మనోహర మాణిక్యం, నాయకులు రత్నం ఏసేపు, సభ్యులు సుబ్బారాయుడు, రాయలసీమ విద్యా వంతుల వేదిక కన్వీనర్ భాస్కర రెడ్డి, జహంగీర్, అరిఫ్ ఖాన్, లాయర్లు పాల్గొన్నారు.

చంద్రబాబు నాయుడు పాలన అందరికీ ఆదర్శవంతం-మంత్రి టీజీ భరత్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: చంద్రబాబు నాయుడు అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం ధ్యేయంగా పాలన చేశారని.. నీతి, నిజాయితీ, చట్ట బద్దత, పారదర్శకత ఆయన ప్రత్యేకతని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. చంద్రబాబును అక్రమ అరెస్టు చేస్తే వర్గాలకు అతీతంగా రాష్ట్ర ప్రజలందరూ ఖండించారని గుర్తు చేశారు. అన్ని రాజకీయ పార్టీలు సంఘీభావం ప్రకటించాయని.. దేశవ్యాప్తంగా మద్దతు పలికారని చెప్పారు. అరెస్టు అయిన ఏ రాజకీయ నేతకు ఇలాంటి సంఘీభావం రాలేదంటే అతిశయోక్తి కాదన్నారు. 4 దశాబ్దాలుగా ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ఎటువంటి మచ్చ లేని చంద్రబాబునాయుదుని వైసీపీ ప్రభుత్వం తప్పుడు కేసులతో అక్రమంగా అరెస్టు చేసి ఏడాది అయిన నేపథ్యంలో మంత్రి టి.జి భరత్ ఒక ప్రకటన విడుదల చేశారు.ఏ తప్పు చేయకపోయినా అవినీతికి పాల్పడినట్లు, ఎటువంటి ఆధారం లేకపోయినా వైసీపీ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని మంత్రి టీజీ భరత్ అన్నారు. అవినీతి, అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు, నిలదీస్తే అక్రమ అరెస్టులుగా గత అయిదేళ్ల పాలన సాగిందన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా 70 దేశాల్లో తెలుగు ప్రజలు ఉప్పెనలా నిరసన తెలియజేశారని గుర్తు చేశారు. యువతకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్‌లో మొదట రూ.3 వేల కోట్ల అవినీతి అని, ఆ తర్వాత రూ.300 కోట్లు అని, ఆ తర్వాత రూ.30 కోట్లు అని.. చివరికి 3 పైసలు కూడా అవినీతికి పాల్పడినట్లు నిరూపించలేకపోయారని మంత్రి భరత్ అన్నారు.

బాలికల వసతి గృహం ఆకస్మిక తనిఖీ

విశాలాంధ్ర-వెల్దుర్తి: స్థానిక బి.సి. బాలికల వసతి గృహాన్ని జిల్లా అసిస్టెంట్ బీ.సి.వెల్ఫేర్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీ చేసి వసతిగృహంలోని విద్యార్థినీలతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వసతి గృహ అధికారిణి శైలజ వసతి గృహాన్ని తీర్చిదిద్దడంలో ఆదర్శంగా ఉన్నారన్నారు. వసతి గృహంలోని పదవ తరగతి విద్యార్థినీలు 2023- 2024 సంవత్సరానికి గాను వంద శాతం ఉత్తీర్ణత సాధించారని వారు ఉత్తీర్ణత సాధించేలా కృషి చేసిన వసతి గృహ అధికారిణి శైలజను శ్రీనివాసులు అభినందించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

విశాలాంధ్ర-సి.బెళగల్ : స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సోమవారం వ్యవసాయ అధికారి జి.మల్లేష్ కుమార్ అన్ని రైతు సేవ ఇంచార్జిలకు మరియు రైతులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తూ సమాచారం ఎలా పొందాలనే దానిపై తెలిపారు. సమాచారం యొక్క గడువు మరియు ఏసమాచారం కావాలో సమాచారం తెలుపని అధికారిపై ఏవిధమైన చర్యలు ఉంటాయో ఆయన వివరించారు. గ్రామాలు,మండలాల్లో రైతులకు కావాల్సిన సమాచారాన్ని రైతులకు అన్ని వేళల్లో తప్పకుండా ఇవ్వడం జరుగుతుందని వ్యవసాయాధికారి తెలిపారు. కార్యక్రమంలో రైతు సేవ ఇంచార్జీలు, రైతులు పాల్గొన్నారు.

కూలిన మట్టి మిద్దె



విశాలాంధ్ర-వెల్దుర్తి: ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మండల పరిధిలోని అల్లు గుందులో అనీఫ్ కుటుంబ సభ్యులు మట్టీమిద్దెలో నివాసముంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకి మట్టీమిద్దె కూలిపోయింది. ఇంట్లో ఉన్న వ్యక్తులకు పెద్దప్రమాదమే తప్పినట్లు బాధితులు తెలిపారు.దీంతో రూ.లక్ష ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి మా కుటుంబాన్ని ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరారు.

వైయస్సార్ కాలనీ సందర్శించిన టీడీపీ నాయకుడు

విశాలాంధ్ర-కౌతాళం రూరల్ : మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని వైయస్సార్ కాలనీ దుస్థితిని తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు వెంకటపతి రాజు పరిశీలించారు. సోమవారం ఉదయం కాలనీ ప్రజల ఫిర్యాదు మేరకు కాలనీలోని ప్రతి రోడ్డు దుస్థితిని సమీక్షించారు. కాలనీ మొత్తం నీటితో జలమయం కావడంతో రాకపోకలు పూర్తిగా ఇబ్బందికరంగా మారింది. కాలనీ రోడ్లు వర్షపు నీటితో నీటి కుంటల మారి దోమలకు నివాసంగా మారాయి. దీంతో కాలనీ ప్రజలు అంటూ వ్యాధుల భారినపడి ఆరోగ్యం దెబ్బతింటుందని కాలనీ ప్రజలు నాయకుడికి వివరించారు. గత పాలకుల వైఫల్యమే పేద ప్రజల ప్రాణాల మీదికి వస్తుందని, కాలనీలో నెలకొన్న సమస్యపై సంబంధిత అధికారులతో చర్చించి తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని వెంకటపతి రాజు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ రాజా నందు, నరసప్ప, లింగేష్, గుట్టయ్య, ఎరిగేరి రాజు, వన్నూరు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర కర్నూలు/నంద్యాల
www.visalaandra.com
కర్నూలు, మంగళవారం 10, సెప్టెంబర్ 2024

ప్రజా సమస్యలు వేగవంతంగా పరిష్కరించండి-సబ్ కలెక్టర్

విశాలాంధ్ర-ఆదోని: పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి అర్జీదారులను సంతృప్తిపరిచేలా చూడాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పిజిఆర్ఎస్ లో స్థానిక ఎమ్మెల్యే పార్థ సారథి, సబ్ కలెక్టర్ పాల్గొని డివిజన్లోని ఆయా మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి వచ్చిన అర్జీలు స్వీకరించారు. మండలంలోని ఆయా శాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువు లోగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా చూడాలన్నారు. ఆదోని మండలం పెద్దహరివనం గ్రామానికి చెందిన హనుమంతుకు సంబంధించి సర్వేనెంబర్ 85 ఏ నందు 1.37 మరియు 9ఏ నందు 2.21 ఎకరాల భూమి ఉన్నది ప్రస్తుతం సదరు భూమి ఆన్లైన్ నందు వేరే వారి పేరు నమోదైనది విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. ఆదోని మండలం కల్లుబావి గ్రామానికి చెందిన మల్లయ్య కు సంబంధించి సర్వేనెంబర్ 200 నందు 0.77 సెంట్ల భూమి ఉండగా వారసత్వంగా నాకు రావలసిన 0.20 భూమి ఆన్లైన్ నందు నమోదు చేయాలని అర్జీ సమర్పించుకున్నారు. ఆదోని మండలం పెద్ద హరివాణం గ్రామానికి చెందిన దేవమ్మకు సంబంధించి సర్వే నంబర్ 589 హెచ్1 పైకి 0.25 సెంట్లు భూమి మరణించిన నా యొక్క భర్త గారి పేరు మీద పట్టాదారు పాస్ పుస్తకం కలిగి ఉన్నది ప్రస్తుతం సదరు భూమి నందు ఆన్లైన్ నందు వేరే వారి పేరు నమోదు అయినది దయచేసి విచారణ చేసి ఆన్లైన్ లో మా పేరు నమోదు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలన అధికారి కే. వసుంధర, డిప్యూటీ ఇన్స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణు సూర్య, శ్రీనివాస రాజు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ సత్యవతి, డిఎల్పివో నూర్జహాన్, డి ఎల్ డి వో నాగేశ్వరరావు, గృహ నిర్మాణ శాఖ డిప్యూటీ ఇంజనీర్ రవికుమార్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కృష్ణారెడ్డి, ఆర్టీసీ డిపో మేనేజర్ మహమ్మద్ రఫీ, తదితరులు పాల్గొన్నారు.

వేదవతి నది కాజవే మరమ్మతు పనులు చేయండి

విశాలాంధ్ర-హొళగుంద : మార్లమడకి సమీపంలో ప్రవహించే వేదావతి నదిపై నిర్మించిన కాజ్వే దెబ్బతినిందని వెంటనే మరమ్మతు పనులుచేయాలని ప్రజలు సోమవారం డిమాండ్ చేశారు భారీ వర్షానికి వేదవతి నది లో భారీ స్థాయిలో వరద నీరు ప్రవహించడం వల్ల కాజువే సిమెంట్ దిమ్మెలు కొట్టుకుపోయాయని అలాగే కాజువే ఇరువైపులా గుంతలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని ప్రజలు తెలిపారు వరద ప్రవాహానికి కాజ్వే పై ఇసుప రాళ్లు తేలాయని వీటి వల్ల దెబ్బలు తగులుతున్నాయని ప్రజలు ఆరోపించారు కాజ్వే అడుగు భాగంలో ఉన్న మోరీలుపూడికతో నిండి పోయాయని దీనివల్ల వరద నీరు కాజ్వే పై ప్రవహించడం వల్ల ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయని అన్నారు సంబంధిత జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని కాజ్వే మరమ్మతు పనులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

నిరుపేద విద్యార్థినికి కలెక్టర్ చేయూత

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : నిరుపేద విద్యార్థిని ఐఐటీ పరీక్షలకు సిద్ధం అయ్యేందుకు పేదరికం అడ్డు రాకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష విద్యార్థిని డి.హాసినికి ల్యాప్‌టాప్ అందచేసి చేయూతను అందించారు. కర్నూలు నగరం విఠల్‌నగర్‌లో నివాసం ఉంటున్న డి.హాసిని అనే విద్యార్థినికి తండ్రి లేరు..పేదరికంలో ఉన్న తల్లి శారదమ్మ కష్టపడి తన కూతురును సర్వేపల్లి రాధాకృష్ణ పాఠశాలలో చదివించింది.. 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో హాసిని 600 మార్కులకు 530 మార్కులు సాధించింది. గాయత్రి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 470 కి 437 మార్కులు సాధించింది. ఐఐటి పరీక్షలకు సిద్ధం అవుతున్న హాసిని పేదరికం కారణంతో ల్యాప్ టాప్ కొనలేకపోతున్న పరిస్థితుల్లో ఆ అమ్మాయికి ల్యాప్ ట్యాప్ అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కలెక్టర్ వెంటనే స్పందించి కెనరా బ్యాంక్ ద్వారా సిఎస్ఆర్ నిధులతో ల్యాప్ ట్యాప్ ను మంజూరు చేయించి హాసినికి అందచేశారు.ఈసందర్భంగా ఇంటర్ రెండవ సంవత్సరం మరింత బాగా చదివి పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని కలెక్టర్ హాసినిని ప్రోత్సహించారు..ఐఐటిలో సీటు సంపాదించి జీవితంలో ఉన్నత శిఖరాలు చేరుకోవాలని సూచించారు. అలాగే కష్టపడి చదివిస్తున్న తల్లి శారదని జీవితంలో బాగా చూసుకోవాలన్నారు. బాగా చదివే విద్యార్థులకు పేదరికం అడ్డుకాకూడదని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కెనరా బ్యాంక్ రీజినల్ మేనేజర్ సుశాంత్ కుమార్, ఎల్డిఎమ్ రామచంద్రరావు, ఎస్సి కార్పొరేషన్ ఈడి తులసి దేవి, విద్యార్థిని తల్లి శారదమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ కాలువలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి

విశాలాంధ్ర-పత్తికొండ: పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ కూడలి నుండి పాత ఊరివాకిలి వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాలువలపై నిర్మించిన అక్రమ కట్టడాలు తొలగించాలని 7వ వార్డు సభ్యులు ఎం. లింగన్న డిమాండ్ చేశారు. సోమవారం మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉండడంతో గత ప్రభుత్వ హయాంలో ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా రోడ్లు వెడల్పు చేపట్టడం జరిగిందన్నారు. నిబంధనలను అతిక్రమించి వ్యాపార దుకాణదారులు డ్రైనేజీ కాలువలపై అక్రమ కట్టడాలు చేపట్టి రేకుల షెడ్లు వేసుకొని ప్రధాన రోడ్డు వరకు రావడంతో ట్రాఫిక్ సమస్య మరల మొదటికొచ్చిందన్నారు. ప్రధాన రహదారిలో ఆవులు విచ్చలవిడిగా సంచరించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈవిషయమై గ్రామపంచాయతీ ఈవో నరసింహులు కలుగజేసుకొని అది పోలీసు వారి పని, మా పరిధి లో లేని అంశమని సమాధానం ఇచ్చారు.పందుల యజమానులకు హెచ్చరిక:-పట్టణంలోని పందులు పెంపకం చేసే యజమానులకు గ్రామపంచాయతీ ఈవో నరసింహులు హెచ్చరికలు జారీ చేశారు. నిబంధనలను అతిక్రమించి విచ్చలవిడిగా పందులు సంచరించడం వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని, నిబంధనల ప్రకారం పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో పందుల పెంపకం షెడ్లు వేసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో ఆదేశానుసారం మూడు రోజులలోపు పందులను ఊరి బయటకు తరలించకపోతే, గ్రామపంచాయతీ సిబ్బంది ద్వారా పందులను తరలిస్తామని హెచ్చరించారు.

ఇష్టంతో కష్ట పడితే ఏదైనా సాధ్యమే..ప్రిన్సిపాల్

విశాలాంధ్ర-రుద్రవరం : విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని విద్యార్థులు ఇష్టంతో కష్టపడితే ఏదైనా సాధ్యపడుతుందని మోడల్ పాఠశాల ప్రిన్సిపల్ నాగేశ్వర రావు అన్నారు. ఇటీవల ఇంజినీరింగ్ లో ఆంధ్ర, అన్నమయ్య యూనివర్సిటీ క్యాంపస్ లలో సీట్లు సాధించిన రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థులు కష్టపడితే ఏదైనా సాధ్యమేనని మా కళాశాల విద్యార్థులు నిరూపించారని ఆదర్శ పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. రుద్రవరం ఆదర్శ పాఠశాల మరియు కళాశాల, రెండవ సంవత్సరం చదివిన విద్యార్థులు బి. రమ్య ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్ ,బి. వంశీ అన్నమయ్య యూనివర్సిటీ క్యాంపస్ ఇంజనీరింగ్ లో సీట్ సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి క్రీడల్లో తమ పాఠశాల కళాశాల తరపున పాల్గొని, గొప్ప ప్రదర్శన కనబరిచి ఉత్తమ ఫలితాలు పొందారు. అదే తరహాలో మంచి తర్ఫీదు ఇచ్చిన పి. డి శ్రీనివాసులు ను అభినందించారు. క్రీడా విభాగంలో తనకి సీటు రావడం ఎంతో మందికి తాను ఆదర్శం అని, ఈ క్రీడా సర్టిఫికెట్ తనకి మంచి సీటు వచ్చేలా చేసింది అని పి. డి శ్రీనివాసులు అన్నారు..బైరి వంశి బాగా కష్ట పడి చదివినాడు.టాలెంట్ ఉండే వాళ్ళు ఎక్కడైనా రాణిస్తారు.ఇద్దరు విద్యార్థులు ఒక మంచి స్థానం లో ఉండాలి అని వైస్ ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ అన్నారు. ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఇంజనీరింగ్ క్యాంపస్ లలో ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయ బృందం నాన్ టీచింగ్ సిబ్బంది తల్లి తండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

సిఎంవో ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం తగదు-జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు : ఫిర్యాదులకు సంబంధించి ఒక్క దరఖాస్తు కూడా రీఓపెన్ కాకూడదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమం ద్వారా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రీ ఓపెన్ , ఇంకా చూడనివి గడువు దాటిన కేసులపై సమీక్షించారు.. రీ ఓపెన్ 37,ఇంకా చూడనివి 21, సిఎం గ్రీవెన్స్ 34, గడువు దాటినవి ఒక్క ఫిర్యాదు ఉన్నాయన్నారు..వీటికి సంబంధించిన అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.. ఎందుకు పెండింగ్ లో ఉన్నాయి అని శాఖల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు.ఒక్క ఫిర్యాదు కూడా రీ ఓపెన్ కాకూడదని, నాణ్యతతో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు... ఆదోని సబ్ కలెక్టర్, పత్తికొండ, కర్నూలు ఆర్డీవోలు, డిపిఓ, హౌసింగ్, కేసులు, పంచాయతీ రాజ్ తదితర శాఖలకు సంబంధించి ఫిర్యాదులు రీ ఓపెన్ అయ్యాయని, వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.ఇంకా చూడని 21 ఉన్నాయని,ఎప్పటికప్పుడు లాగిన్ ఓపెన్ చేసి వచ్చిన ఫిర్యాదులను చూసి తగిన చర్యలు తీసుకోవాలని, పెండింగ్ ఉండకూడదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.. ఆర్టీసీ, డిపిఓ, వక్ఫ్, పంచాయతీ రాజ్, ఆర్ఐఓ, కర్నూలు, దేవనకొండ ఎంపిడిఓ కార్యాలయాలు, తదితర శాఖలన్నీ జాబితాలో ఉన్నాయని, వెంటనే వాటిని చూసి సమస్యలను పరిష్కరించాలన్నారు.సిఎంవో ఫిర్యాదుల కు సంబంధించి ఇప్పటి వరకు 34 పెండింగ్ ఉన్నాయని, అందులో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో 7, కర్నూలు ఆర్డీఓ కార్యాలయంలో 7 అత్యధికంగా పెండింగ్ లో ఉన్నాయని, సిఎంవో గ్రీవెన్స్ పరిష్కారంలో అలసత్వం ఉండకూడదని కలెక్టర్ ఆదేశించారు.. డిఎంహెచ్ఓ, మున్సిపల్, బిసి సంక్షేమం, దేవాదాయ శాఖ, ఉపాధి కల్పన, డిఎస్ఓ, డిఈఓ, డిఆర్డిఎ,ఆలూరు ఎంపిడిఓ కార్యాలయాల్లో సిఎంవో ఫిర్యాదులు పెండింగ్ లో ఉన్నాయని, జాప్యం చేయకుండా వీటిని వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..ఇందుకు సంబంధించిన నివేదికను నేరుగా డి ఆర్ ఓ కు అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..పోలీస్ శాఖలో ఒక దరఖాస్తు పరిష్కార గడువు దాటిందని, ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లి ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ గ్రీవెన్స్ కార్యక్రమానికి హాజరైన పోలీస్ అధికారికి సూచించారు. వంద రోజుల లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలి...జిల్లా అభివృద్ధిలో భాగంగా వంద రోజుల లక్ష్యాలను మండల వారీగా విభజించి నిర్ణయించడం జరిగిందని, ఈ లక్ష్యాల సాధనకు వీలుగా కార్యాచరణ ప్రణాళికను త్వరితగతిన అమలు చేయాలని కలెక్టర్ జిల్లా అధికారులు,ఎంపీడీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు.. ఇందుకు సంబంధించి శుక్రవారం ఎంపిడిఓలు, తహశీల్దార్లు, జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష చేస్తామని, సమీక్షకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, డిఆర్ఓ చిరంజీవి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పరిష్కారానికి కృషి చేయాలి

విశాలాంధ్ర-డోన్ రూరల్: ప్రజల నుండి వచ్చే అర్జీలను పరిశీలించి తగిన పరిష్కారాలు చూపించే దిశగా కృషి చేస్తామని తహశీల్దార్ నాగమణి అన్నారు. మండల తాహశీల్దార్ కార్యాలయంలో సోమవారం నాగమణి మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు ఆయా గ్రామా లకు సంబంధించిన వీఆర్ఓలు అన్ని రకాల అంశాలను పరిశీలించి సమస్య ఉంటే పరిశీలించి తగిన పరిష్కారాలు చూపించాలని తెలిపారు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించిన ప్రజా ఫిర్యాదుల వేదిక ద్వారా ప్రజల నుంచి వచ్చే అర్జీలను, వినతులను స్వీకరించి వాటికి తగిన ఆధారాలు ఉన్నట్లయితే అక్కడికక్కడే పరిష్కార మార్గాలను చూపుతామని నాగమణి తెలిపారు.

భక్తి శ్రద్ధలతో వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర-కల్లూరు: మూడు రోజుల పాటు వినాయక స్వాములకు ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి చివరి రోజు ప్రత్యేక వాహనాల్లో స్వామివారి విగ్రహాలను మేలతాళాలతో ఊరేగింపుగా భక్తులు ఊరేగించి నిమజ్జన కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు మండల పరిధిలోని ఉలిందకొండ, చిన్నటేకూరు, పర్ల ,గోకులపాడు, రేమడూరు, మార్కాపురం, బస్తిపాడు, బొల్లవరం తదితర గ్రామాల్లో భక్తులు వినాయక విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో అలంకరించుకొని తీర్థ ప్రసాదాలు పంచుకుంటూ స్వామివారి విగ్రహాలను జై గణేశా బోలో గణేశా గణేష్ మహారాజ్ కి జై అంటూ జేజేలు కొడుతూ స్వామివారికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఆయా గ్రామాల్లో స్వామివారి లడ్డులను భక్తులు వేలం పాట పాడి దక్కించుకొని భక్తిని చాటుకున్నారు. నిమజ్జన కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పులిందకొండ ఎస్సై ధనుంజయ తన సిబ్బందితో ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు ఈ కార్యక్రమాలను సిఐ చంద్రబాబు నాయుడు ఆకస్మిక తనిఖీ చేసి ఏర్పాట్లపై ఆరాధించారు.

అట్టహాసంగా వినాయక నిమజ్జనం

విశాలాంధ్ర-కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో సోమవారం ఘనంగా గణేష్ నిమజ్జనం చేపట్టారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా నాయకులు శ్రీ మారుతి మోహన్ మాట్లాడుతూ సుమారుగా 60కి పైగా గణనాథుని విగ్రహాలు కొలువుదీరినట్లు తెలిపారు. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు ఊరేగింపు కార్యక్రమాలు జరిపి అనంతరం ఎల్ఎల్సి కాల్వలో మరి జనం చేశారు. స్థానిక ప్రజలు యువకులు కార్యక్రమంలో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొని జయప్రదం చేశారు. సీఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీవో సుబ్బరాజు, డిప్యూటీ తహసీల్దారు వీరభద్రగౌడ్, ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షించారు మండలంలో ఎరిగేరి, సులేకేరి, బంటకుంట తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.కార్యక్రమంలో ప్రహల్లాదచారి, పాల్ దినకర్, వైస్ సర్పంచ్ సక్కరి తిక్కయ్య, వైసీపీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, వైస్ ఎంపీపీ బుజ్జి స్వామి.అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు గణేష్ నిమజ్జనానికి బయలుదేరిన వారికి మజ్జిగ, నీటి ప్యాకెట్లను గణేష్ ఉత్సవ కమిటీ, పరిషత్ జిల్లా అధ్యక్షులు మారుతి మోహన్, రాఘవేందర్ రెడ్డి, కౌతాళం సర్పంచ్ పాల్ దినకర్, సి.ఐ.అశోక్ కుమార్. ఎంపీడీవో సుబ్బరాజు, ప్రతిభ హైస్కూల్ కరస్పాండెంట్ సయ్యద్ దూద్‌బాష, మదిన మసీద్ పెద్దలు వలిసాబ్, ఖాజా హుస్సేన్, మౌలానా అక్బర్, అవాజ్ కమిటీ సభ్యులు షేక్షావలి, గౌస్‌పీర్, కలయిగార్ మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.ఈకార్యక్రమంలో పాల్గొన్న ఇతరులకు నిమజ్జన శుభాకాంక్షలు తెలిపారు.

విశాలాంధ్ర-పెద్దకడబూరు : మండల పరిధిలోని చిన్న

తుంబలం, కల్లుకుంట, హెచ్ మురవణి, బసలదొడ్డి, కంబలదిన్నె,జాలవాడి, పీకలబెట్ట, బాపులదొడ్డి, చిన్నకడబూరు, పెద్దకడబూరు తదితర గ్రామాల్లో సోమవారం వినాయకుల నిమజ్జనం వేడుకలు అట్టహాసంగా జరిగాయి. మూడు రోజుల నుంచి వినాయకునికి వివిధ రకరకాలైన పిండివంటకాలతో నైవేద్యములు సమర్పించారు. భక్తులు పెట్టిన నైవేధ్యాన్ని బొజ్జ గణపయ్య ఆరగించారు. మూడు రోజులపాటు విఘ్నేశ్వరులు ప్రత్యేక పూజలు అందుకున్నారు. సాయంత్రం 5 గంటలకు వినాయకుల నిమజ్జన ఊరేగింపు ప్రధాన రహదారుల వెంబడి గణపతి బొప్పా మోరియా నినాదాల మధ్య అట్టహాసంగా జరిగింది. పెద్దకడబూరులోని 65 గణపయ్య విగ్రహాలను ఎల్లెల్సీకి తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ నిరంజన్ రెడ్డి గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వినాయకుల చేతిలో లడ్డుకు భలే గిరాకీ

మండలంలోని ఆయా గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా కొలువుదీరిన వినాయకుల చేతిలోని లడ్డులకు వేలం పాటలో భలేగిరాకీ లభించింది. పెద్దకడబూరు మండల పరిధిలోని బాపులదొడ్డిలో కొలువుదీరిన గణేష్ చేతిలోని లడ్డును ఎంపీటీసీ మహాదేవ రూ.32 వేలకు వేలంపాట పాడి దక్కించుకున్నారు. అలాగే మండల కేంద్రమైన పెద్దకడబూరులోని తేరు బజారులో కొలవైన వినాయక చేతిలోని లడ్డును మొట్రు ఈరన్న రూ. 21 వేలు చౌడేశ్వరీ కాలనీలో కుమ్మరి నీలకంతప్ప ఇంటి వద్ద వినాయకుని చేతిలోని లడ్డూను పద్మసాలె గోపాల్ రూ.16 వేలకు దక్కించుకున్నారు. చౌడేశ్వరీ గుడి వద్ద పల్లెపాడు లక్ష్మన్న రూ.13,001, లక్ష్మీపేటలో మొట్రు వీరేష్ రూ.7,500,బస్టాండ్ ఆవరణలో ఇబ్రహీంపురం చంద్ర రూ. మునిస్వామి గుడిదగ్గర గణేష్ లడ్డును వెంకన్న రూ. 7,500, బస్టాండ్ ఆవరణంలో ఇబ్రహీంపురం చంద్ర రూ. 7,101, సుంకలమ్మ గుడి వద్ద తలారి ఈరన్న రూ. 6 వేలు, కురువవీధిలో నేసే గణేష్ 5,500, తహసీల్దార్ కార్యాలయం వద్ద కురువ నరశింహులు రూ.5,001 గణేషుని లడ్డూలను వేలం పాటలో దక్కించుకున్నారు.

విశాలాంధ్ర-కోడుమూరు : కోడుమూరు మండలంలో

వినాయకుడి నిమజ్జనోత్సవం వేడుకలను భక్తులు గ్రామ ప్రజలందరూ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా నియోజకవర్గ కేంద్రమైన కోడుమూరు పట్టణంలో కొలువు దీరిన సుమారు 128 వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ కార్యక్రమాన్ని స్థానిక మెయిన్ బజార్లో వెలసిన శ్రీ మల్లేశ్వరస్వామి ఆలయంలో వీరశైవ లింగాయతీ సంక్షేమ సంఘం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కొలువుదీరిన గణనాథుడి విగ్రహం వద్ద కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించి, జెండా ఊపి నిమజ్జనోత్సవాన్ని ప్రారంభించారు.నిమజ్జన ఊరేగింపు సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా

డీఎస్పీ బాబుప్రసాద్, కర్నూలు టౌన్ సీఐ మన్సురుద్దీన్,ఎస్సై ఏపీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు.కాగా వినాయక చవితి పండుగను పురస్కరించుకొని శనివారం గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలో అందంగా అలంకరించిన మండపాలలో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్ఠించారు.మూడు రోజులపాటు మండపాలలోని గణనాధుడి విగ్రహాలకు భక్తిశ్రదలతో ప్రజలు, భక్తులు విశేష పూజలు చేశారు. వినాయక ఉత్సవ వేడుకల్లో భాగంగా మూడోరోజు సోమవారం గణనాధుల విగ్రహాలను అందంగా అలంకరించిన ఆటోలు,ట్రాక్టర్ల పల్లకిలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తూ నిమజ్జనం చేపట్టారు. నిమజ్జోత్సవాన్ని పురస్కరించుకొని చిన్నారులు, యువతీ-యువకులు, మహిళల రంగులు చల్లుకుంటూ కొలహాలంగా భక్తి శ్రద్ధలతో వినాయక విగ్రహాల ముందు జైబోలో గణేష్ మహారాజ్‌కి జై..జై అంటూ స్వామివారికి వీడ్కోలు ఘనంగా పలి

కారు.మండలంలోని వర్కూరు, కృష్ణాపురం,పులకుర్తి తదితర గ్రామాలలో వినాయక నిమజ్జన గ్రామోత్సవం అనంతరం గణనాథుడి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

వినాయక ఘాట్ వద్ద భారీ ఏర్పాట్లు

కాగా పట్టణ శివారులోని వెంకటగిరి రోడ్డు నందు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు నర్రా నాగేశ్వరరావు, ఈశ్వరరెడ్డి, కట్టెల డిపో శ్రీనివాసులు, కిరణ్, నటరాజ్, ప్రతాపరెడ్డి, అశోక్, వెంకటస్వామి,తాయప్ప తదితరుల ఆధ్వర్యంలో వినాయక నిమజ్జనోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. గణనాథుడి విగ్ర హాల నిమజ్జనం కార్యక్రమాన్ని వీక్షించేందుకు భక్తులకు స్థా నిక కోట్ల సర్కిల్ వద్ద నుండి మహిళలను తరలించేందుకు వాహనాలను ఏర్పాటు చేయడంతో పాటు వినాయక ఘాటు వద్ద సకల సౌకర్యాలు కల్పించారు.

వాటర్ బాటిళ్లను పంపిణీ చేసిన టీడీపీ నాయకులు

ఇదిలా ఉండగా సోమవారం కోడుమూరు పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పురస్కరించుకొని స్థానిక పాత బస్టాండ్ సర్కిల్లో షాది ఖానా వద్ద టిడిపి నాయకులు వాటర్ బాటిల్స్ పంపిణీ చేపట్టారు.మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కృష్ణాపురం శంకర్‌రెడ్డి,బివి గోపాల్ నాయుడు, బడేసా గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ బాటిళ్ల పంపిణీ శిబిరాన్ని కోడుమూరు ఎస్సై ఏపీ శ్రీనివాసులు చేతుల మీదుగా ప్రారంభించారు.అనంతరం వినాయక విగ్రహాల నిర్వాహకులకు,భక్తులకు వాటర్ బాటిల్లను పంపిణీ చేశారు.

విశాలాంధ్ర-హొళగుంద: మండల కేంద్రమైన హొలగుంద

లో సోమవారం 24 చోట్ల గణేష్ మిత్రమండలి వారు కూర్చోబెట్టిన భారీగణేష్ విగ్రహాలను ముత్తైదువుల 101 కళాశాలు, మేళ తాళాలు, బీరప్ప డోలు, భజనలు, పులి వేషాలు, మజ్జిగ బండి వేషాలతో పురవీధులగుండా భారీ ఊరేగింపు నిర్వహించారు.భక్తులు, యువకులు, మహిళలు కేరింతలు కొడుతూ నిమజ్జనంలో ఆనందోత్సవాలు జరుపుకున్నారు నిమజ్జనంలో యువకులు రంగులను పూజించుకుంటూ కేరింతలు కొడుతూ గణేష్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు ఇచ్చారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గణేష్ నిమజ్జనం ప్రశాంతంగా జరిగింది గణేష్ నిమజ్జనంలో ఎలాంటి ఘర్షణలు జరగకుండా ఉండడానికి ఆదోని ట్రైన్ డిఎస్పి ధీరజ్, సీఐ శ్రీనివాస్ నాయక్, ఎస్సై బాల నరసింహులు భారీ పోలీసు బందోబస్తు నిర్వహించారు. గణేష్ విగ్రహాలను ఎల్ఎల్సీ దిగువ కాలువలు గణేష్ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేసి గంగమ్మ ఒడిలోకి చేర్చారు నిమజ్జనంలో ఎలాంటి ఇబ్బంది

లేకుండా సర్పంచు రంగమ్మ, కార్యదర్శి రాజశేఖర్ గౌడ్ ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు.

విశాలాంధ్ర-సి.బెళగల్ : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని రెండు రోజులపాటు విశేష పూజలందుకొని సోమవారం గణేష్‌ని గంగమ్మ వాడికి చేర్చారు. ఈ నిమజ్జనం సందర్భంగా మేలతాళాలు డప్పులతో గ్రామాల్లోని పురవీధుల గుండా భారీ ఊరేగింపు నిర్వహిస్తూ మహిళలు మరియు యువకులు కేరింతలు కొడుతూ కనీసం నిమజ్జనంలో పాల్గొన్నారు. ఈనిమజ్జనం కార్యక్రమాన్ని సుంకేసుల డ్యాం దగ్గర చేపట్టారు. ఈ నిమజ్జన కార్యక్రమంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సి.బెలగల్ ఎస్సై తిమ్మారెడ్డి సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

విశాలాంధ్ర- కోవెలకుంట్ల: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గణనాథుల నిమజ్జనం వైభవంగా సాగింది. నిమజ్జనానికి ముందు ప్రత్యేక పూజలు చేసి గ్రామాల్లోని పలువీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. గణపతి బొప్పమోరియా నినాదాలు మార్మోగాయి.బ్యాండ్ మేళాలు వాయిస్తూ యువతీ యువకులు, చిన్నారులు, నిర్వాహకులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈనెల 7న వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని గ్రామాల్లోని వాడవాడలో వినాయక మండపాలు ఏర్పాటు చేసి బొజ్జ గణపయ్య ప్రతిమలను ఏర్పాటు చేసి మూడు రోజులు పాటు పూజలు చేశారు.వినాయక ఉత్సవ మండల కమిటీ ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో మూడో రోజున మండల కేంద్రాల్లో ఐదోరోజు నిమజ్జన కార్యక్రమాలు నిర్వహించు కోవాలని సూచించడంతో గ్రామాల్లో కొలువైన గణనాయక ప్రతిమలకు సోమవారం పెద్దఎత్తున పూజలు,అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ఆయా గణేశ్ ప్రతిమలను నిమజ్జనం చేశారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కోవెలకుంట్ల పట్టణ ఎస్సై మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు సౌదర దీన్నే, అమ్మడాల, వెలుగటూరు, బిజినవేముల, వల్లంపాడు, గ్రామాల్లో పూజలందుకున్న ప్రతిమలను కోవెలకుంట్లలోని కుందూనదిలో నిమజ్జనం చేశారు. మండల ఉత్సవ కమిటీ ఘాట్ వద్ద నిమజ్జనం సందర్భంగా భారీ క్రేన్లు అధికారులు ఏర్పాటు చేశారు.